
పాఠం
14

# 19వ శతాబ్దంలో ప్రజాస్వామిక, జాతీయవాద విప్లవాలు

## ఐరోపా దేశాలలో పెల్లుబికిన జాతీయతావాదం

గత అధ్యాయంలో ప్రజాస్వామిక విప్లవాల గురించి చదివాం. వీటిల్లో చాలావరకు జాతీయతా స్వభావం కలిగినవి. ఆ సమయంలో యూరపు సామ్రాజ్యాలుగా, చిన్న రాజ్యాలుగా విభజింపబడి ఉంది. ఉమ్మడి చరిత్ర, సంస్కృతి, ఆర్థిక జీవనం పంచుకుంటున్నామన్న భావం కలిగిన పౌరుల క్రియాశీల భాగస్వామ్యంపై ఆధారపడిన బలమైన దేశాలను ఏర్పాటు చేయటానికి ప్రజాస్వామిక, జాతీయతావాద ఉద్యమాలు ప్రయత్నించాయి. ఈ ప్రయత్నాల ఫలితంగా పలు దేశాలతో కూడిన వంశపారంపర్య రాచరికస్థానంలో యూరపులో జాతీయ రాజ్యాలు ఏర్పడ్డాయి.

యూరపులో చాలా కాలంనుంచి స్పష్టంగా నిర్వచించిన సరిహద్దులతో సార్వభౌమ నియంత్రణ, కేంద్రీకృత అధికారంతో కూడిన ఆధునిక రాజ్యాలు రూపుదిద్దుకోసాగాయి. అయితే జాతీయ రాజ్యాలు అన్న భావన పాలకులకు మాత్రమే ఉంటే సరిపోదు. దానిలోని అధిక శాతం పౌరులలో ఉమ్మడి చరిత్ర, వారసత్వాలతో




*పటం 1: 1815 వియన్నా కాంగ్రెసు తరవాత యూరపు*

© SCERT not to be republished

కూడిన ఒకే గుర్తింపు ఉండటం కూడా ముఖ్యం. ఈ ఉమ్మడి భావన అనాదికాలం నుండి లేదు. పోరాటాల ద్వారా, నాయకులు, సామాన్యప్రజల చర్యల ద్వారా ఇది రూపుదిద్దుకుంది.

ఫ్రెంచ్ విప్లవం నేపథ్యంలో రాజకీయ, రాజ్యాంగ మార్పులతో అధికారం రాచరికం నుండి ఫ్రెంచి పౌరులతో కూడిన ఒక సంఘానికి బదిలీ అయ్యింది. ఇక ముందు దేశాలుగా ఏర్పడేది, దాని భవిష్యత్తును తీర్చిదిద్దేది దాని ప్రజలేనని విప్లవం చాటింది. నియంతృత్వాలనుంచి ఐరోపా ప్రజలను విముక్తం చేయటం – అంటే యూరపు ప్రజలు రాజ్యాలుగా ఏర్పడటానికి సహాయపడటం ఫ్రెంచిదేశ విధి, కర్తవ్యమని విప్లవకారులు ప్రకటించారు.

'రాజ్యం' అన్న పదానికి ఫ్రెంచివిప్లవం ఒక కొత్త అర్థాన్ని ఇచ్చింది. రాజ్యమంటే దానికి చెందిన ప్రజలు నివసించే ప్రాంతం కాదు, రాజ్యమంటే అందులోని ప్రజలే. ఫ్రాన్స్ అన్నది ఆ పేరుతో పిలవబడుతున్న భౌగోళిక ప్రాంతం కాదు, 'ఫ్రెంచ్ ప్రజలే'. దీనినుంచే సార్వభౌమత్వం అన్న భావన ఏర్పడింది. ఒక దేశం తనపైన ఇంకొక చట్టాన్ని, అధికారాన్ని ఆమోదించదు. ఒక దేశం సార్వభౌమత్వ దేశమైతే ఆ దేశప్రజలకే సమస్త అధికారం సమకూరుతుంది. ప్రజలపైన వేరే పాలకులు ఉండటానికి వీలులేదు, గణతంత్రమే ఉంటుంది. ఈ గణతంత్ర ప్రభుత్వం ప్రజలనుంచి అధికారం పొంది ప్రజలకు జవాబుదారీగా ఉంటుంది. నెపోలియన్ చక్రవర్తి అయినప్పుడు తనను 'ఫ్రెంచి గణతంత్రపు చక్రవర్తి'గా పేర్కొనటం ఆసక్తిగొలుపుతుంది. ప్రజల సార్వభౌమత్వం అన్న భావనకు గల బలాన్ని ఇది తెలియచేస్తుంది. ప్రజలే సార్వభౌములన్న ఈ భావన వల్లనే ఫ్రెంచి సైన్యానికి అంతటి బలం సమకూరింది. సైన్యం వెనక విప్లవపౌరులతో కూడిన దేశమంతా సమైక్యంగా కట్టుబడి నిలబడింది. ఫ్రాన్స్‌కి వ్యతిరేకంగా దాదాపుగా యూరపు మొత్తం యుద్ధంలో నిలబడినప్పుడు కిరాయి సైనికులు ఉంటే ఆ దేశానికి ఏమాత్రం విజయావకాశాలు ఉండేవికావు.

**జాకొబిన్ క్లబ్బులు:** అతివాద ప్రజాస్వామిక మేధావుల క్లబ్బు

జాకొబిన్ రాజ్యాంగం ప్రకారం ప్రజలందరికీ ఓటువేసే హక్కు, తిరుగుబాటు చేసే హక్కు లభించాయి. ప్రజలకు పని లేదా జీవనోపాధిని కల్పించాలని రాజ్యాంగం పేర్కొంది. ప్రజలందరి సంతోషమే ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు. నిజానికి అది అమలులోకి రాకపోయినప్పటికీ చరిత్రలో మొదటి అసలైన ప్రజాస్వామిక రాజ్యాంగం ఇది. ఫ్రెంచి వలస ప్రాంతాలలో బానిసత్వాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. నెపోలియన్ అధికారం చేజిక్కించుకోవటంతో ఒక అడుగు వెనక్కి పడింది. గణతంత్రాన్ని నాశనం చేసి సామ్రాజ్యాన్ని స్థాపించినప్పటికీ అతడు గణతంత్ర భావనను మట్టుబెట్టలేకపోయాడు. నెపోలియన్ ఓడిపోయిన తరవాత, పాత రాచరిక వంశానికి తిరిగి అధికారం కట్టబెట్టారు. అయితే, మరికొన్ని సంవత్సరాలకే, 1830లో మరొక విప్లవం కమ్ముకోసాగింది. 1848లో రాచరికాన్ని కూలదోశారు, కానీ మళ్లీ అది అధికారంలోకి వచ్చింది. అంతిమంగా 1871లో గణతంత్ర రాజ్యం నెలకొల్పబడింది.

సాధారణ ప్రజల – పట్టణ పేదల, రైతాంగం మద్దతు, పోరాటంతో విప్లవం సంభవించింది. 1792లో చరిత్రలో మొట్టమొదటిసారి కార్మికులు, రైతాంగం, ఆస్తిలేని ప్రజలకు సమాన రాజకీయ హక్కులు లభించాయి.

ఓటువేసే హక్కు, ప్రతినిధులను ఎన్నుకునే హక్కు వల్ల సామాన్య ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదు. రైతాంగానికి భూమి దక్కింది. కాని విప్లవ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచిన కార్మికులు, చేతివృత్తి కళాకారులకు ఆ విప్లవం నిజమైన సమానత్వాన్ని ఇవ్వలేదు. వాళ్లకి ఆర్థిక సమానత్వంతోనే

- ఆయా దేశాలలో జాతీయతాభావం ఏర్పడటానికి నెపోలియన్ దాడులు ఎలా దోహదపడి ఉంటాయి?

నిజమైన సమానత్వం లభిస్తుంది. సామాజిక సమానత, సమ సమాజం అన్న సిద్ధాంతం కొత్త రాజకీయ ఉద్యమానికి దారితీసిన తొలి దేశాలలో ఫ్రాన్స్ ఒకటి.

## యూరపులో రాజ్యాలు

పద్దెనిమిదవ శతాబ్దపు మధ్యకాలంనాటి యూరపు పటం చూస్తే ఈనాడు మనకు తెలిసిన 'జాతీయరాజ్యాలు' నాడు లేవని మీరు గమనిస్తారు. ఇవ్వాళ మనం జర్మనీ, ఇటలీ, స్విట్జర్లాండ్ అని పిలుస్తున్న రాజ్యాలు ఆనాడు డచీలు, కాంటన్లుగా విభజింపబడి ఉండేవి. వీటి పాలకులకు స్వయంప్రతిపత్తిగల అధికారాలు ఉండేవి. తూర్పు, మధ్య యూరపు ప్రాంతాలు నియంతృత్వ రాచరికాల కింద ఉండేవి. వాళ్ల పాలనలో వివిధ రకాల ప్రజలు ఉండేవాళ్లు. వీళ్లు తమకు ఒక ఉమ్మడి సంస్కృతి, లేదా సామూహిక గుర్తింపు ఉందని భావించేవాళ్లు కాదు. వీళ్లు తరచు వేరువేరు భాషలు మాట్లాడుతూ ఉండేవాళ్లు. వీళ్ల మూలాలు కూడా వేరు. ఉదాహరణకు ఆస్ట్రియా–హంగరీని పాలించిన హబ్స్‌బర్గ్ సామ్రాజ్యంలో వివిధ ప్రాంతాలు, అనేక రకాల ప్రజలు ఉండేవాళ్లు. దీంట్లో టైరాల్, ఆస్ట్రియా, సుడెటెన్‌లాండ్, బొహీమియాలతో కూడిన ఆల్పైన్ ప్రాంతంలో కులీన పాలనను కలిగిఉండి ప్రధానంగా వారు జర్మన్ భాష మాట్లాడేవారు. ఇటాలియన్ మాట్లాడే లోంబార్డి, వెనీషియా కూడా దీంట్లో ఉన్నాయి. హంగరీలో సగం మంది జనాభా మగ్యార్ మాట్లాడేవాళ్లు, మిగిలిన సగం వివిధ మాండలికాలు మాట్లాడే వాళ్లు. గాలిసియాలో కులీనవర్గం వాళ్లు పోలిష్ భాష మాట్లాడేవాళ్లు. ఈ మూడు ప్రధానవర్గాలు కాకుండా సామ్రాజ్య పరిధిలో రైతాంగ ప్రజలు ఉండేవాళ్లు. ఉత్తరానికి బొహీమియన్లు, స్లోవాక్‌లు, కార్నియోలాలో స్లోవీన్లు, దక్షిణానికి క్రొయాట్లు, తూర్పున ట్రాన్సిల్వేనియాలో రొమన్లు ఉండేవారు. ఈ తేడాల వల్ల రాజకీయ ఐక్యత అంత తేలికగా ఏర్పడదు. ఈ వివిధ బృందాలను కలుపుతున్న అంశం ఒకే చక్రవర్తితో పాలింపబడటం.

- జాతీయతావాదం, జాతీయ రాజ్యాలు అన్న భావనలు ఎలా ఆవిర్భవించాయి?
- జాతీయతాభావం ఏర్పడటంలో భాష, జనాదరణ పొందిన సంప్రదాయాల ప్రాముఖ్యత గురించి చర్చించండి.

### కొన్ని ముఖ్యమైన తేదీలు

| | |
|---|---|
| *1797 –* | *ఇటలీపై నెపోలియన్ దాడి. నెపోలియన్ యుద్ధాలు ప్రారంభం.* |
| *1814-1815 –* | *నెపోలియన్ పరాజయం; వియన్నా శాంతి ఒప్పందం* |
| *1821 –* | *గ్రీకుల స్వతంత్ర పోరాటం ఆరంభం.* |
| *1848 –* | *యూరపులో విప్లవాలు; ఆర్థిక సమస్యలకి వ్యతిరేకంగా చేతివృత్తి కళాకారులు, పారిశ్రామిక కార్మికులు, రైతాంగ తిరుగుబాటు; రాజ్యాంగాన్ని, ప్రాతినిధ్య పభుత్వాన్ని మధ్యతరగతి కోరసాగింది; ఇటాలియన్లు, జర్మన్లు, మగ్యార్లు, పోలిష్ ప్రజలు, చెక్ ప్రజలు వంటి వాళ్లు దేశీయ రాజ్యాలు కోరసాగారు.* |
| *1859-1870–* | *ఇటలీ ఏకీకరణ* |
| *1866-1871–* | *జర్మనీ ఏకీకరణ* |
| *1905–* | *హబ్స్‌బర్గ్, ఒట్టోమన్ సామ్రాజ్యాలలో స్లావ్ జాతీయతావాదం బలం పుంజుకుంది.* |

## కులీనవర్గం, కొత్తగా ఏర్పడిన మధ్యతరగతి

ఐరోపా ఖండంలో సామాజికంగా, రాజకీయంగా భూమిగల కులీనవర్గం ఆధిపత్యంలో ఉంది. ఈ వర్గప్రజలు వివిధ ప్రాంతాలలో సైతం ఒకేరకమైన జీవన విధానం కలిగి ఉండి ఒకటిగా ఉండేవాళ్లు. పల్లెల్లో వాళ్లకి ఎస్టేట్లు, పట్టణ ఇళ్లు ఉండేవి. దౌత్య అవసరాల రీత్యా, ఉన్నత సమాజంలో ఫ్రెంచి భాష మాట్లాడేవాళ్లు. వివాహం ద్వారా కులీన వర్గాల మధ్య సంబంధాలు

ఉండేవి. ఆధిపత్యం చెలాయించే ఈ కులీనవర్గం సంఖ్యాపరంగా తక్కువగా ఉండేది. జనాభాలో అధిక శాతంగా రైతాంగం ఉండేది. పశ్చిమ భాగంలో భూమిలో అధిక శాతాన్ని కౌలుదార్లు, చిన్నరైతులు సాగు చేసేవారు. తూర్పు, మధ్య ప్రాంతాలలో పెద్దపెద్ద ఎస్టేటులు ఉండేవి. వీటిని బానిస పని వాళ్లు (సెర్ఫులు) సాగు చేసేవాళ్లు.

పశ్చిమ ప్రాంతాలు, మధ్య యూరపులు పారిశ్రామిక ఉత్పత్తి, వాణిజ్యాలతో ప్రగతిని సాధించాయి. దీని ఫలితంగా పట్టణాలు పెరిగాయి. మార్కెట్టుకోసం ఉత్పత్తి చేసే వాణిజ్య వర్గాలు ఏర్పడ్డాయి. 18వ శతాబ్దపు రెండవ సగంలో ఇంగ్లాండులో పారిశ్రామికీకరణ మొదలైంది. కానీ ఫ్రాన్స్, జర్మనీలో కొన్ని ప్రాంతాల్లో 19వ శతాబ్దంలో మాత్రమే పారిశ్రామికీకరణ జరిగింది. ఈ నేపథ్యంలో కొత్త సామాజిక వర్గాలు ఏర్పడ్డాయి: శ్రామికవర్గ ప్రజలు, మధ్యతరగతి. వీళ్లుకాక పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, వివిధ వృత్తినిపుణులు ఏర్పడ్డారు. మధ్య, తూర్పు యూరప్‌లో 19వ శతాబ్దం చివరి వరకు ఈ వర్గాలు తక్కువ సంఖ్యలోనే ఉండేవి. చదువుకున్న, ఉదారవాద మధ్యతరగతి ప్రజలలో కులీనవర్గాల హక్కుల రద్దు, జాతీయ సమైక్యతవంటి భావనలు ఆదరణ పొందాయి.

**సెర్ఫులు:** ఒక భూస్వామి భూములకు కట్టుబడి ఉన్నవాళ్లు. అతడి అనుమతి లేకుండా వేరేచోటుకి వెళ్లటానికివీలులేనివారు.

## ఉదారవాద జాతీయతావాదం

19వ శతాబ్దం ఆరంభంలో జాతీయ సమైక్యతా భావనలకు ఉదారవాద సిద్ధాంతంతో దగ్గర సంబంధం ఉండేది (ఇంగ్లీషులో 'లిబరలిజం' అన్నపదం స్వేచ్ఛ అనే అర్థం ఉన్న లిబర్ అన్న లాటిన్ పదం నుంచి ఏర్పడింది). కొత్తగా ఏర్పడిన మధ్యతరగతులకు వ్యక్తిగత స్వేచ్ఛ, చట్టం ముందు అందరూ సమానులుగా ఉండటం అన్నవాటికి ఉదారవాదం ప్రతీకగా నిలిచింది. రాజకీయంగా ప్రజామోదంతో ప్రభుత్వం అన్న భావనకు ప్రాధాన్యతను ఇచ్చింది. ఫ్రెంచి విప్లవం నాటినుంచి ఉదారవాదం అంటే నియంతపాలనకు అంతం, చర్చి ప్రత్యేక హక్కులకు అంతం, రాజ్యాంగం, పార్లమెంటు ద్వారా ప్రాతినిధ్య ప్రభుత్వంగా పరిగణింపబడసాగింది. 19వ శతాబ్దపు ఉదారవాదులు వ్యక్తిగత ఆస్తిహక్కుకి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు.

చట్టం ముందు సమానత్వం అంటే అందరికీ ఓటుహక్కు ఉండాలన్న భావన ఆనాటికి ఇంకా ఏర్పడలేదు. ఉదారవాద ప్రజాస్వామ్యంలో మొదటి రాజకీయ ప్రయోగమైన ఫ్రెంచి విప్లవంలో ఓటువేసే హక్కు, ఎన్నిక కాబడే హక్కు కేవలం ఆస్తికలిగిన పురుషులకు ఇచ్చారన్న విషయం మీకు గుర్తుండే ఉంటుంది. ఆస్తిలేని పురుషులనూ, మహిళలందరికీ రాజకీయహక్కులు లేకుండా చేశారు. జాకొబిన్స్ పాలనలో కొద్దికాలంపాటు వయోజన పురుషులందరికీ ఓటుహక్కు ఉండేది. నెపోలియన్ కోడ్ ఓటుహక్కును పరిమితం చేసి మహిళలను తండ్రులూ, భర్తల అధికారానికి లోబడిన వాళ్లుగా చేసింది. 19వ శతాబ్దం అంతా, 20వ శతాబ్దం ఆరంభంలో సమాన రాజకీయహక్కులు కోరుతూ మహిళలూ, ఆస్తిలేని పురుషులూ ఉద్యమాలు చేపట్టారు. ఆర్థిక రంగంలో స్వేచ్ఛా మార్కెట్లనూ, సరుకులూ, పెట్టుబడీ కదలికలపై ప్రభుత్వ పరిమితులను రద్దుచేయటాన్ని ఉదారవాదం కోరింది. 19వ శతాబ్దంలో కొత్తగా ఏర్పడుతున్న మధ్యతరగతి ప్రజల ప్రధానమైన కోర్కె ఇదే.

**సఫ్రేజ్ (Suffrage):** సార్వజనీన ఓటు హక్కు

© SCERT not to be republished

19వ శతాబ్దపు మొదటి సగంలో జర్మనీ మాట్లాడే ప్రాంతాలను ఉదాహరణగా తీసుకుందాం. నెపోలియన్ పరిపాలనా చర్యలకింద అనేక చిన్న చిన్న ప్రాంతాలతో కూడిన 39 రాష్ట్రాల సమాఖ్య ఏర్పడింది. ఒక్కొక్క రాష్ట్రానికీ తనదైన ద్రవ్యవిధానం (కరెన్సీ), తూనికలూ, కొలతలూ ఉండేవి. 1833లో హంబర్గ్ నుంచి న్యూరెంబర్గ్ వెళుతున్న వ్యాపారి 11 తనిఖీ కేంద్రాలలో ప్రతిచోటా 5 శాతం సుంకం చెల్లించాల్సి వచ్చేది. సరుకుల కొలతలు లేదా బరువుల ఆధారంగా ఈ సుంకాలను విధించేవాళ్లు. ప్రతీ ప్రాంతానికీ తనదైన తూనికలూ, కొలతలూ ఉండటం వల్ల సుంకం లెక్కించటానికి చాలా సమయం పట్టేది. ఉదాహరణకు వస్త్రకొలతకు ఉపయోగించే 'ఎల్లే' (elle) ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క పొడవును సూచించేది. ఫ్రాంక్‌ఫర్ట్‌లో ఎల్లే అంటే 54.7 సెం.మీ. కాగా మైన్స్‌లో 55.1 సెం.మీ, నూరెంబర్గ్‌లో 65.6 సెం.మీ., ఫ్రేబర్గ్‌లో 53.5 సెం.మీ.గా ఉండేది.

- పాతరాజ్యాలు వ్యాపార, పరిశ్రమల ప్రగతిని ఏవిధంగా అడ్డుకున్నాయి?
- ఆ దేశాలలో ఉదారవాద ప్రజాస్వామ్యం వ్యాపార, పరిశ్రమలకు ఏ విధంగా దోహదం చేసింది?

కొత్తగా ఏర్పడుతున్న వాణిజ్య వర్గాలు ఈ పరిస్థితులను ఆర్థిక మార్పిడి, ప్రగతికి అవరోధంగా భావించసాగాయి. సరుకులు, ప్రజలు, పెట్టుబడి ఎటువంటి ఆటంకాలు లేకుండా తరలింపబడేలా ఏకీకృత ఆర్థిక ప్రాంతం ఏర్పాటు చేయాలని ఈ వర్గాలు కోరాయి. 1834లో ప్రష్యా చొరవతో "సుంకాల సమాఖ్య" లేదా "జోల్వెరిన్" (zollverein) ఏర్పడింది, దీంట్లో అనేక జర్మన్ ప్రాంతాలు భాగస్వామ్యం అయ్యాయి. ఈ సమాఖ్య తనిఖీ కేంద్రాలను రద్దుచేసి 30కి పైగా ఉన్న ద్రవ్య విధానాలను రెండుకి కుదించింది. రైలుమార్గాలు వృద్ధిచెందటంతో రవాణా మరింత తేలికైంది. ఆర్థిక ప్రయోజనాలకి దేశ ఐక్యతకి ఈ విధంగా సంబంధం ఏర్పడింది. ఆర్థిక జాతీయతావాదం ఉప్పొంగటంతో ఆ కాలంలో పెరుగుతున్న జాతీయతా భావనలు మరింత బలం సమకూర్చుకున్నాయి.

- మన దేశంలో ఉదారవాద, ప్రజాస్వామిక రాజకీయ విధానం ఉందా? మీ సమాధానానికి కారణాలు పేర్కొనండి.

## 1815 తరవాత కొత్త సంప్రదాయవాదం

1815లో నెపోలియన్ ఓడిపోయిన తరవాత యూరోపియన్ ప్రభుత్వాలలో సంప్రదాయవాదం చోటుచేసుకుంది. రాచరికం, చర్చి, సామాజిక తారతమ్యాలూ, ఆస్తీ, కుటుంబం వంటి సాంప్రదాయ వ్యవస్థలను కాపాడాలని సంప్రదాయవాదులు భావించారు. అయితే సంప్రదాయవాదులలో చాలామంది విప్లవానికి ముందున్న సమాజాన్నే తిరిగి ఏర్పాటుచేయాలని కోరుకోలేదు. నెపోలియన్ చేపట్టిన మార్పులద్వారా రాచరికం వంటి సంప్రదాయ వ్యవస్థలను ఆధునికీకరణ బలపరుస్తుందని వాళ్లు గుర్తించారు. ఇది రాజ్యాధికారాన్ని మరింత బలోపేతం, సమర్థవంతం చేయగలదు. ఆధునికసైన్యం, సమర్థ పరిపాలనావ్యవస్థ, వృద్ధిచెందుతున్న ఆర్థిక స్థితి, ఫ్యూడలిజం, బానిసత్వాల రద్దుద్వారా యూరపులో నిరంకుశ రాచరికాలను బలోపేతం చేయవచ్చు అని వాళ్లు భావించారు.

- మన ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి సంప్రదాయవాదం మంచిదనే వాళ్లకీ, ఉదారవాద ప్రజాస్వామ్యం మంచిదనేవాళ్లకీ మధ్య చర్చ నిర్వహించండి.

- అభిప్రాయ వ్యక్తీకరణ, విమర్శలకు వ్యక్తికి ఉన్న స్వేచ్ఛలను సంప్రదాయవాదం ఎందుకు హరిస్తుంది?
- నెపోలియన్ కోడ్‌లో వేటిని రాజులు తిరస్కరించి ఉంటారు, వేటిని ఆమోదించి ఉంటారు?

1815లో నెపోలియన్‌ని సంయుక్తంగా ఓడించిన బ్రిటన్, రష్యా, ప్రష్యా, ఆస్ట్రియా వంటి ఐరోపా శక్తులు వియన్నాలో యూరప్ పునర్నిర్మాణం కోసం సమావేశం అయ్యాయి. ఆస్ట్రియా ఛాన్సలర్

SCERT not to be republished

డ్యూక్ మెటర్నిచ్ ఈ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చాడు. నెపోలియన్ యుద్ధాలవల్ల యూరపులో వచ్చిన మార్పులను రద్దుచేసే ఉద్దేశంతో వియన్నా ఒప్పందాన్ని (1815) సభ్యులు రూపొందించారు. ఫ్రెంచ్ విప్లవంలో పదవీచ్యుతులైన బోర్బన్ వంశానికి తిరిగి అధికారం కట్టబెట్టారు. నెపోలియన్ ఆక్రమించుకున్న ఇతరదేశ ప్రాంతాలను ఫ్రాన్స్ వదులుకోవలసి వచ్చింది. భవిష్యత్తులో ఫ్రాన్స్ విస్తరించకుండా ఆ దేశ సరిహద్దులలో అనేక దేశాలను ఏర్పాటు చేశారు. నెపోలియన్ ద్వారా పదవీచ్యుతులైన రాచరికాలకు తిరిగి అధికారం కట్టబెట్టి యూరపులో కొత్త సంప్రదాయవాదాన్ని నెలకొల్పటం ప్రధాన ఉద్దేశం.




*చిత్రం 14.1: ఆలోచనాపరుల బృందం, 1820లో వేసిన వ్యంగ్య చిత్రం, కళాకారులెవరో తెలియదు.*

*ఎడమవైపున ఉన్న ఫలకంపై ఉన్న వాక్యం:*

'ఈ రోజు సమావేశపు ముఖ్యప్రశ్న: ఆలోచించటానికి మనకు ఎంత సమయం అనుమతిస్తారు?'

కుడివైపున ఉన్న ఫలకంలో బృంద నియమాలు ఉన్నాయి, వీటిల్లో:

'1. జ్ఞానవంతుల సమాజపు మొదటి నియమం నిశ్శబ్దాన్ని పాటించటం.

2. ఈ బృంద సభ్యులు మాట్లాడాలనే చాపల్యానికి గురి కాకుండా లోపలికి వచ్చేటప్పుడు మూతికి కట్టు ఇవ్వబడుతుంది.'

- ఈ వ్యంగ్య చిత్రకారుడు ఏం చెప్పటానికి ప్రయత్నిస్తున్నాడు?

1815లో ఏర్పడిన సంప్రదాయవాద రాజ్యాలు నియంతృత్వ ధోరణులు కనపరిచేవి. అవి విమర్శను, వ్యతిరేకతనూ ఏమాత్రం సహించేవి కావు. నియంతృత్వ ప్రభుత్వాల నైతికతను ప్రశ్నించే కార్యక్రమాలను అణచివేయటానికి ప్రయత్నించేవి. ఫ్రెంచ్ విప్లవంతో ముడిపడిన స్వేచ్ఛా, స్వాతంత్ర్య భావనలను వ్యక్తపరచే పాటలూ, నాటికలను అనుమతించే పుస్తకాలూ, వార్తాపత్రికలలో ప్రచురితమయ్యే వాటినీ నియంత్రించే సెన్సారు చట్టాలను ప్రవేశపెట్టాయి. అయినప్పటికీ ఫ్రెంచివిప్లవం జ్ఞాపకాలు ఉదారవాదులకు స్ఫూర్తిని ఇస్తూనే ఉన్నాయి. కొత్త సాంప్రదాయ విధానాన్ని విమర్శించే ఉదారవాద జాతీయవాదుల కోరికలలో పత్రికాస్వేచ్ఛ ఒకటి.

## కాల్పనిక వాదం, జాతీయతాభావం



*చిత్రం 14.2: చియోస్ వద్ద హత్యాకాండ, 1824లో యూజిన్ డెలాక్రాయిక్స్ వేసిన చిత్రం*

***ఫ్రెంచి కాల్పనికవాద చిత్రకారులలో డెలాక్రాయిక్స్ చాలా ముఖ్యమైనవాడు. ఈ పెద్ద (4.19 మీ X 3.54 మీ) చిత్రంలో చియోస్ దీవిలో తురుష్కుల చేతిలో చనిపోయిన 20,000 గ్రీకుల ఘటనను చిత్రీకరించాడు. ఈ ఘటనను నాటకీయంగా చిత్రీకరించటం, మహిళలు, పిల్లల వేదనలపై కేంద్రీకరించటం, ప్రకాశవంతమైన రంగులు వాడటం వంటివాటి ద్వారా చూసే వాళ్ల ఉద్వేగాలను స్పందింపచేసి గ్రీకుల పట్ల సానుభూతి కలిగించటానికి డెలాక్రాయిక్స్ ప్రయత్నించాడు.***

కేవలం యుద్ధాలు, భౌగోళిక ప్రాంతాన్ని విస్తరింపచేయటం ద్వారా మాత్రమే జాతీయతాభావం పెంపొందలేదు. దేశం అన్న భావనలో సంస్కృతి కూడా ముఖ్య పాత్ర పోషించింది. కళలు, కవిత్వం, కథలు, సంగీతం వంటివి జాతీయతా భావాన్ని మలచటంలో సహాయపడ్డాయి.

సాంస్కృతిక ఉద్యమమైన కాల్పనికవాదం ఒక ప్రత్యేక రకమైన జాతీయతాభావాన్ని పెంపొందించటానికి ప్రయత్నించింది. కాల్పనికవాద కవులు, కళాకారులు విజ్ఞాన శాస్త్రం, హేతువులకు పెద్ద పీట వేయటాన్ని విమర్శించారు. ఉద్వేగాలు, సహజ విజ్ఞానం, మహిమలు వంటి భావనలపై వీళ్లు దృష్టి కేంద్రీకరించారు.

ప్రాంతీయ భాష, స్థానిక జానపద కథల సేకరణలు కేవలం పురాతన జాతీయత, స్ఫూర్తిని తిరిగి సాధించడానికి ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా చాలా వరకు నిరక్షరాస్యులయిన విస్తృత ప్రజానీకంలోకి జాతీయతా సందేశాన్ని తీసుకెళ్ళడానికి దోహదపడ్డాయి.


- ఎనిమిదవ తరగతిలో భారతీయ జాతీయతావాదులు దేశంలోని సాంప్రదాయ, జానపద కళల పునరుద్ధరణకు ప్రాధాన్యతనిచ్చారని మీరు చదివారు. ఇది ముఖ్యమని వాళ్లు ఎందుకు భావించారు?

## ఆకలి, కష్టాలు, ప్రజా తిరుగుబాటు

1830లలో యూరపు ఆర్థికంగా తీవ్ర గడ్డు పరిస్థితులను ఎదుర్కొంది. 19వ శతాబ్దపు మొదటి సగంలో యూరప్ అంతటా జనాభా గణనీయంగా పెరిగింది. చాలా దేశాలలో పనులకంటే పని చేసే వాళ్లు ఎక్కువగా ఉన్నారు. పల్లెప్రాంతాల నుంచి ప్రజలు పట్టణాలకు వలస వెళ్లి కిక్కిరిసిన మురికివాడలలో నివసించసాగారు. పట్టణాలలో చిన్న ఉత్పత్తిదారులు పారిశ్రామికంగా అభివృద్ధి సాధించిన ఇంగ్లాండు నుంచి దిగుమతి చేసుకునే తక్కువ ధరకు లభించే యంత్ర ఉత్పత్తులనుంచి తీవ్ర పోటీని ఎదుర్కొనే వాళ్లు. వస్త్ర తయారీలో ఈ పోటీ మరీ ఎక్కువగా ఉండేది. మిగిలిన యూరపులో వస్త్ర తయారీ ఇళ్లల్లో, చిన్న చిన్న కార్యశాలల్లో జరుగుతూ ఇంకా అంతగా యాంత్రీకరణ చెందలేదు. ఇంకా రాచరిక పాలనలో ఉన్న ప్రాంతాలలో రైతాంగం ఫ్యూడల్ పన్నులు, సేవలతో నలిగి పోతుండేది. ఒక సంవత్సరం పంటలు సరిగా పండకపోయినా, లేదా ఆహార ధరలు పెరిగినా పల్లెల్లో, పట్టణాల్లో పేదరికం పెరిగిపోయేది.

©SCERT not to be republished

అటువంటి సంవత్సరాలలో 1848 ఒకటి. ఆహార కొరత, తీవ్ర నిరుద్యోగం వల్ల పారిస్ ప్రజలు ఆందోళనలకు దిగారు, రహదారులు దిగ్బంధం చేశారు. దాంతో లూయీ ఫిలిప్ దేశం వదిలి పారిపోయాడు. జాతీయ శాసనసభ దేశాన్ని గణతంత్రంగా ప్రకటించి 21 సంవత్సరాలు దాటిన పురుషులందరికీ ఓటు హక్కు కల్పించింది, పనికి హక్కును కల్పించింది. ఉపాధి కల్పించటానికి జాతీయ కార్యశాలలు ఏర్పాటు చేశారు.



*చిత్రం 14.3: రైతాంగ తిరుగుబాటు, 1848*

## తిరుగుబాట్లు: 1830, 1848

ఒకవైపున సంప్రదాయవాద రాజ్యాలు తమ పట్టు బిగించటానికి ప్రయత్నిస్తుంటే,ఇంకోవైపు ఇటలీ, జర్మనీ రాష్ట్రాలలో, ఒట్టోమన్ సామ్రాజ్యంలోని ప్రాంతాలలో, ఐర్లాండ్, పోలాండ్‌లలో ఉదారవాదం, జాతీయతావాదం విప్లవభావాలతో కలవసాగాయి. చదువుకున్న, మధ్యతరగతి సంపన్న వర్గాలకు చెందిన ఉదారవాద జాతీయతావాదులు ఈ విప్లవాలకు నాయకత్వం వహించారు. వీళ్లలో ఆచార్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, గుమాస్తాలు, మధ్యతరగతికి చెందిన వాణిజ్య వర్గ ప్రజలు ఉన్నారు.

లూయీ XVIII ని వియన్నా కాంగ్రెసు తిరిగి సింహాసనంపై కూర్చోపెట్టటంతో ఫ్రాన్స్‌లో బోర్బన్లు మళ్లీ అధికారంలోకి వచ్చారని చూశాం. సోదరుడైన లూయీ XVI లాగా ప్రస్తుత లూయీ నిరంకుశుడు కాదు. 1814 చార్టర్ ప్రకారం అతడు పార్లమెంటు ఆమోదంతో పాలన కొనసాగించాడు. లూయీ పరిపాలన కొనసాగినంతవరకు ఫ్రాన్స్‌లో ఎటువంటి వ్యతిరేకత ఎదురుకాలేదు. కానీ 1824లో మూడవ సోదరుడైన చార్లెస్ X (1820–1830) సింహాసనాన్ని అధిష్ఠించాడు. అతడు విప్లవాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. కులీనులకు, మతగురువులకు ప్రత్యేక హక్కులను పునరుద్ధరించటానికి ప్రయత్నించాడు. అతడి చర్యలను డిప్యూటీల సభ వ్యతిరేకించింది. దాంతో అతడు 1814 చార్టర్‌ని పక్కకు పెట్టి తన ఇష్టమొచ్చినట్లు పరిపాలించసాగాడు. ఫలితంగా చెలరేగిన తిరుగుబాటు వల్ల చార్లెస్ అధికారాన్ని వదులుకోవాల్సి వచ్చింది. అతడికి వరసకి సోదరుడైన లూయీ ఫిలిప్ (1830–1848) రాజు అయ్యాడు.

1830లో చార్లెస్ X కి వ్యతిరేకంగా వచ్చిన విప్లవంతో అనేక వరస విప్లవాలు వెల్లువెత్తాయి. వియన్నా కాంగ్రెసుతో హాలాండ్, బెల్జియం ఏకీకృతమయ్యాయన్న విషయం మీరు చదివారు. ఈ విలీనం వియన్నా సమావేశంలో విజ్ఞత కొరవడటాన్ని సూచిస్తుంది. భాష, మతం, జాతీయతలలో ఈ రెండు దేశాలు పూర్తిగా భిన్నమైనవి. అదీకాకుండా బెల్జియన్ల కంటే ప్రభుత్వంలో డచ్ ప్రజలకు ఎక్కువ అధికారం ఉండేది. 1830లో బెల్జియన్ ప్రజలు తిరుగుబాటు చేసి స్వతంత్ర దేశాన్ని నెలకొల్పుకున్నారు. ఇతర దేశాలలోని బలమైన శక్తులు ఈ పరిణామాలను అంతగా ఇష్టపడలేదు కానీ వాళ్లు చేయగలిగింది ఏమీ లేకపోయింది. తమ దేశంలోని విప్లవంతో తలపడటమే ఫ్రాన్స్‌కి సరిపోయింది. ఆస్ట్రియా చాలా దూరంలో ఉంది. చివరికి బెల్జియన్ల స్వాతంత్ర్యాన్ని ఒప్పుకోక తప్పలేదు. లూయీ ఫిలిప్ కింద ఫ్రాన్స్ మాదిరిగ బెల్జియన్లు కూడా రాజ్యాంగబద్ధ రాచరిక వ్యవస్థను నెలకొల్పారు.

© SCERT not to be republished

వియన్నా సమావేశం పోలాండ్‌లో అధిక భాగాన్ని రష్యాకి ఇచ్చింది. ఇప్పుడు విప్లవం పోలాండ్‌కి విస్తరించింది. అయితే రష్యా బలమైన శక్తి కావటంతో బెల్జియంలాగా కాకుండా పోలాండ్ స్థితి భిన్నంగా ఉండింది. పోలిష్ ప్రజలకు తమ పక్క దేశాలనుంచి మద్దతు లభించలేదు. వాళ్లు ఎంతగానో పోరాడారు కానీ చివరికి ఓడిపోయారు. ఫలితంగా జారుచక్రవర్తి పోలాండ్‌ని రష్యాలో కలిపేసుకున్నాడు. వందలాది పోలిష్ ప్రజలను చంపేశారు. వాళ్లల్లో జాతీయతాస్ఫూర్తిని తుడిచిపెట్టటానికి అన్ని ప్రయత్నాలు చేశారు.



*చిత్రం 14.4: పారిస్‌లో తిరుగుబాటు చేస్తున్న ఫ్రాన్సు ప్రజలు*

## 1848 నాటి తిరుగుబాట్లు

1830లో లాగానే 1848లో కూడా తిరుగుబాటు ఫ్రాన్స్‌లో మొదలయ్యింది. రాజ్యాంగబద్ధ రాచరికంలో భాగంగా లూయీ ఫిలిప్ పరిపాలించాలి. సింహాసనాన్ని అధిష్టిస్తున్నప్పుడు అతడిని 'ప్రజలరాజు'గా పేర్కొన్నారు. అతడి పట్టాభిషేకం 'దేవుని దయతోనూ', 'జాతి కోరిక ప్రకారం' జరిగిందని అన్నారు. అయితే కాలం గడుస్తున్నకొద్దీ అతడి ప్రభుత్వం తిరోగామి పంథాను అవలంబించసాగింది. ఇది ఎంతగా మారిందంటే 1848 నాటికి అతడి పాలనకు తీవ్ర వ్యతిరేకత నెలకొంది. అతడి శత్రువులు పెరిగిపోయారు. అతడు నియమించిన ముఖ్యమంత్రి ప్రజాదరణ కోల్పోవటంతో అతడిని తొలగించక తప్పలేదు. పదవీచ్యుతుడైన ఆ మంత్రి ఇంటిముందు అల్లర్లు చెలరేగాయి. రాజు సైనికులు జరిపిన కాల్పులలో ఇరవైముగ్గురు చనిపోయారు. దాంతో ప్రజలు తిరగబడ్డారు. పలాయనమంత్రం తప్పించి లూయీ ఫిలిప్‌కి మరొక దారిలేక పోయింది. 'గణతంత్రం వర్ధిల్లాలి' అన్న నినాదాలు వీధులలో మిన్నుముట్టాయి. దాంతో భయపడిపోయిన ఫిలిప్ తన సోదరుడు లూయీ XIV మాదిరిగానే ఇంగ్లాండుకి పారిపోయాడు.

- చార్లెస్ X, లూయీ ఫిలిప్‌లు ఫ్రాన్స్ వదిలి ఎందుకు పారిపోవలసి వచ్చిందో వివరించండి.

తిరుగుబాటు స్ఫూర్తి బలంగా ఉన్న పారిస్‌లో వీధి పోరాటాలు కొనసాగాయి. శ్రామికులు ఉపాధి కోరసాగారు. ప్రాంతీయ ప్రభుత్వాలు వాళ్లకి పని కల్పించటానికి ప్రయత్నించాయి. ఈ ప్రయోగంలో లూయీ బ్లాంక్ అనే సోషలిస్టు ముందున్నాడు. కానీ నిజాయితీ లోపించటం, దురాశల వల్ల ఈ ప్రణాళికను అమలు చేయలేకపోయారు. దాంతో హింస కొనసాగింది. తిరుగుబాటుదారులను అంతిమంగా ప్రభుత్వ సైన్యాలు ఓడించి తీవ్ర శిక్షలు విధించాయి.

## 1848 విప్లవం, మహిళలు

ఉదారవాద ఉద్యమంలో మహిళలు పెద్దసంఖ్యలో చురుకుగా పాలుపంచుకున్నారు. అయితే వాళ్లకి రాజకీయ హక్కులు ఇవ్వటం వివాదాస్పద అంశంగా మారింది. మహిళలు ప్రత్యేక రాజకీయ సంఘాలుగా ఏర్పడ్డారు. పత్రికలు స్థాపించారు, రాజకీయ సమావేశాలు, ప్రదర్శనలలో పాల్గొన్నారు. అయినప్పటికీ శాసనసభ ఎన్నికలలో వాళ్లకు ఓటుహక్కు ఇవ్వలేదు. సేంట్‌పాల్ చర్చిలో సమావేశమైన ఫ్రాంక్‌ఫర్ట్ పార్లమెంటుకి మహిళలను పరిశీలకులుగా మాత్రమే సందర్శకుల ప్రాంగణంలోకి అనుమతించారు.

## జర్మనీ – దేశాన్ని సైన్యం నిర్మించగలదా?

1848 తరవాత ప్రజాస్వామ్యం, విప్లవాలనుంచి యూరపులో జాతీయతావాదం దూరమయ్యింది. యూరపుపై రాజకీయ ఆధిపత్యం సాధించటానికి సంప్రదాయవాదులు జాతీయ బలాన్ని పెంచుకుని, ఉపయోగించుకున్నారు.

జర్మనీ, ఇటలీలు జాతీయ రాజ్యాలుగా ఏకీకరణ చెందిన ప్రక్రియలో దీనిని గమనించవచ్చు. జర్మనీ మధ్యతరగతి ప్రజలలో జాతీయతాభావం విస్తృతంగా ఉందని మీరు చూశారు. 1848లో వీళ్లు జర్మనీలోని వివిధ ప్రాంతాలను సమాఖ్యగా ఏర్పరచి ఎన్నికైన పార్లమెంటు పాలనలో జాతీయ రాజ్యంగ మలచటానికి ప్రయత్నించారు. ఈ ఉదారవాద ప్రయత్నాన్ని రాచరిక, సైనిక శక్తులు అణచివేశాయి. ఇందులో సైన్యానికి జంకర్లు అనే ప్రష్యా బడా భూస్వాములు కూడా సహకరించారు.

- ఈ వ్యంగ్య చిత్రాన్ని వివరించండి. బిస్మార్క్‌కీ ఎన్నికైన పార్లమెంటు డిప్యూటీలకీ మధ్య సంబంధాన్ని ఇది ఎలా చూపిస్తోంది? ప్రజాస్వామిక ప్రక్రియల గురించి చిత్రకారుడు ఏం వ్యాఖ్యానించదలుచుకున్నాడు?




*జర్మను పార్లమెంటులో ఒట్టో వాన్ బిస్మార్క్ వ్యంగ్య చిత్రం, చిత్రకారుడు ఫెగారో, వియన్నా, 1870 మార్చి 5.*

అప్పటినుంచి జాతిని ఏకం చేసే ఉద్యమానికి ప్రష్యా నాయకత్వం వహించసాగింది. ప్రష్యా సైన్యం, పాలనా యంత్రాంగం సహాయంతో ప్రష్యా ప్రధానమంత్రి ఒట్టో వాన్ బిస్మార్క్ ఈ ప్రక్రియకు సూత్రధారిగా వ్యవహరించాడు. ఏడు సంవత్సరాలలో ఆస్ట్రియా, డెన్మార్క్, ఫ్రాన్స్‌పై జరిగిన మూడు యుద్ధాలలో ప్రష్యా విజయం సాధించటం తో ఏకీకరణ ప్రక్రియ పూర్తి అయ్యింది. 1871 జనవరిలోవెర్సయిల్స్‌లో జరిగినసమారోహంలో ప్రష్యా రాజైన విలియం - I జర్మన్ చక్రవర్తిగా ప్రకటింపబడ్డాడు.



*చిత్రం 14.5: వర్సయిలస్‌లోని అద్దాల మహలులో జర్మనీ సామ్రాజ్య ప్రకటన, మధ్యలో కైసర్, ప్రష్యా సైన్యాధిపతి అయిన జనరల్ వాన్ రూన్ ఉన్నారు. వాళ్ల పక్కనే బిస్మార్క్ ఉన్నాడు. చిత్రకారుడు ఆంటన్ వాన్ వెర్నర్ ఈ బృహత్తర (2.7 మీ X 2.7 మీ) చిత్రాన్ని 1885లో బిస్మార్క్ 70వ పుట్టినరోజు కానుకగా చిత్రకారుడు ఇచ్చాడు*

© SCERT not to be republished




*పటం 2: జర్మనీ ఏకీకరణ (1866-71)*

జర్మనీ దేశ నిర్మాణ ప్రక్రియలో ప్రష్యా బలం ప్రధాన పాత్ర వహించింది. ద్రవ్య విధాన, బ్యాంకింగ్, చట్ట, న్యాయ వ్యవస్థలను ఆధునికీకరించటానికి కొత్తగా ఏర్పడిన జర్మనీ ప్రభుత్వం ప్రయత్నించింది. ప్రష్యా అనుసరిస్తున్న విధానాలు జర్మనీకి కూడా నమూనాగా మారాయి.

## ఇటలీ ఏకీకరణ


జర్మనీలాగానే ఇటలీ కూడా దీర్ఘకాలంగా రాజకీయంగా ముక్కలై ఉంది. అనేక వంశపారంపర్య రాజ్యాలలో, అనేక జాతులతో కూడిన హాబ్స్‌బర్గ్ సామ్రాజ్యంలో ఇటాలియన్లు చెల్లాచెదురుగా ఉన్నారు. 19వ శతాబ్దం మధ్యకాలంనాటి ఇటలీ ఏడు రాజ్యాలుగా విభజింపబడి ఉంది. ఇందులో సార్డీనియా-పీడ్మాంట్ అన్న ఒక్కదానినే ఇటాలియన్ రాచరిక కుటుంబం పరిపాలించేది.

ఉత్తర ప్రాంతం ఆస్ట్రియాకి చెందిన హబ్స్‌బర్గ్‌ల కింద, మధ్య ప్రాంతం పోపుకింద, దక్షిణ ప్రాంతాలు స్పెయిన్‌కి చెందిన బోర్బన్ రాజుల కింద ఉండేవి. ఇటాలియన్ భాష కూడా ఇంకా ఒక రూపం దాల్చలేదు, దీంట్లో అనేక ప్రాంతీయ, స్థానిక తేడాలు ఉండేవి.

1830లలో ఏకీకృత ఇటాలియన్ గణతంత్రాన్ని ఏర్పరచటానికి గిస్సెప్పి మాజిని ఒక కార్యక్రమాన్ని రూపొందించాడు. తన భావాలను ప్రచారం చేయటానికి అతడు **'యంగ్ ఇటలీ'** అన్న ఒక రహస్య సంఘాన్ని ఏర్పాటు చేశాడు. 1831, 1848లోని విప్లవాలు విఫలం అవ్వటంతో యుద్ధం ద్వారా ఇటాలియన్ రాజ్యాలను ఒకటిగా చేసే బాధ్యత సార్డీనియా, పీడ్మాంట్ రాజు విక్టర్ ఇమాన్యుయెల్ - II మీద పడింది. ఐక్య ఇటలీ ఏర్పడితేనే ఆర్థికాభివృద్ధి, రాజకీయాధిపత్యం సాధించగలనని ఈ ప్రాంతాల పరిపాలకులు భావించారు.


ఇటలీ ప్రాంతాలను కలిపే ఉద్యమానికి నాయకత్వం వహించిన ప్రధానమంత్రి కవూర్ విప్లవవాది కాదు, ప్రజాస్వామికవాదీ కాదు. ఇటలీ కులీన వర్గ సంపన్న, విద్యావంతుల మాదిరి అతడు కూడా ఇటాలియన్ కంటే ఫ్రెంచి బాగా మాట్లాడేవాడు. ఫ్రాన్స్‌తో తెలివిగా దౌత్య సంబంధాన్ని కవూర్ కుదిర్చిన ఫలితంగా 1859లో ఆస్ట్రియన్ సైన్యాన్ని సార్డీనియా -పీడ్మాంట్ ఓడించగలిగింది. ఈ యుద్ధంలో సైన్యంతోపాటు గిసెప్పీ గారిబాల్డి

నేతృత్వంలోని సాయుధ వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 1860లో వీళ్లు దక్షిణ ఇటలీ నుండి సిసిలీస్ రాజ్యంలోకి చొచ్చుకుపోయి స్పానిష్ పాలకులను తరిమి కొట్టటానికి స్థానిక రైతాంగ మద్దతు కూడగట్టగలిగారు. 1861లో ఏకీకృత ఇటలీకి విక్టర్ ఇమాన్యుయెల్–II ను రాజుగా ప్రకటించారు. అయితే ఇటాలియన్ ప్రజానీకంలో అధిక శాతం నిరక్షరాస్యులు కావటం వల్ల ఈ ఉదారవాద, జాతీయతా భావజాలం తెలియకుండా ఉండిపోయారు. దక్షిణ ఇటలీలో గారిబాల్డికి మద్దతు ఇచ్చిన రైతాంగం ఇటాలియా అన్న పేరే వినలేదు. **లా టాలియా** అంటే విక్టర్ ఇమాన్యుయెల్ భార్య అన్న భావనతో వాళ్లు ఉన్నారు!



*చిత్రం 14.6: గిస్సెప్పి మాజిని, యంగ్ యూరప్ స్థాపన, బెర్న్, 1833, గియా కొమో మాంటెగాజా చిత్రం*

- రాజు ఇమాన్యుయెల్– II కింద ఏకీకృతమైన ఇటలీ నిజమైన జాతీయ రాజ్యంగా మారిందా? మీ సమాధానానికి కారణాలు తెల్పండి.




*పటం 3: ఏకీకరణకు ముందు 1858లో ఇటాలియన్ రాజ్యాలు*



© SCERT not to be republished

## కీలక పదాలు

1. నిరంకుశత్వం 2. జాతీయతావాదం 3. ఉదారవాదం
4. పాలనా యంత్రాంగం 5. కాల్పనికవాదం 6. కొత్త మధ్యతరగతి

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. సరైన వాటిని ఎంచుకోండి

- ఒక దేశానికి ...................... (ఉమ్మడి చరిత్ర, ఉమ్మడి సంస్కృతి, ఉమ్మడి ఆర్థిక వ్యవస్థ, పైవన్నీ, పైవి ఏవీకావు) ఉండాలని ప్రజాస్వామిక, జాతీయతావాద ఉద్యమాలు భావించాయి.
- వివిధ దేశాలలో జాకొబిన్ క్లబ్బులను ........................(రైతాంగం; రాచరికం; మధ్యతరగతి; సైన్యం) ఏర్పాటు చేసింది.
- 18వ శతాబ్దం మధ్యకాలంలో భూమి ..................... కింద ఉండేది. దానిని ................. సాగు చేసే వాళ్లు (మధ్యతరగతి, సైన్యం, రాచరిక కుటుంబాలు, కౌలుదారులు)

2. 18వ శతాబ్దపు మధ్యకాలంనాటి యూరపులోని ప్రజలలో భాష, జాతిమూలాలు, వాణిజ్య పద్ధతులలో గల పోలికలు, తేడాలను పేర్కొనండి.
3. "జాతీయ రాజ్యాలు ఏర్పడటంతో రాచరిక వర్గాల ఆధిపత్యం తగ్గి మధ్య తరగతి ప్రాభవం పెరిగింది" అన్న వాక్యంతో మీరు ఏకీభవిస్తారా? కారణాలు ఇవ్వండి.
4. మీరు చదివిన ఒక భారత దేశ జాతీయతావాదికి, మాజినికి మధ్య సంభాషణను ఊహించి రాయండి.
5. సాంప్రదాయవాదులు, ఉదారవాదుల గురించి వివరించే వాక్యాలను గుర్తించండి. మన ప్రస్తుత నేపథ్యంలో వీటికి ఉదాహరణలు ఇవ్వండి.
6. ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీలో జాతీయ రాజ్యాలు ఏర్పడటంలో తేడాలు, పోలికలు చూపించే పట్టికను తయారు చేయండి.
7. 1848 ఉదారవాదుల తిరుగుబాటు అంటే ఏమిటో వివరించండి. ఉదారవాదులు సమర్థించిన రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలు ఏమిటి?
8. జర్మనీ ఏకీకృతమయిన ప్రక్రియను క్లుప్తంగా వివరించండి.
9. వియన్నా సమావేశం చేసిన మార్పులను యూరపు పటంలో చూపించండి.

## ప్రాజెక్టు

18వ శతాబ్దపు మధ్యకాలపు (1815) పటాన్ని, ప్రస్తుత యూరపు పటంతో పోల్చి మీరు గమనించిన తేడాలను మీ నోటు పుస్తకంలో రాయండి.

© SCERT not to be republished